నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, ఆదివారం 28 జూలై 2024 | HYDERABAD

## అందుబాటులోకి హెచ్ఎండీఏ టీడీఆర్

సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ) : హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీకి చెందిన ట్రాన్స్‌ఫర్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) బ్యాంకును అందుబాటులోకి తీసుకువచ్చింది. జీహెచ్ఎంసీ తరహాలో భూ నిర్వాసితులకు సాయమందించేలా హెచ్ఎండీఏ పరిధిలోనూ ఏర్పాటు చేశారు. హెచ్ఎండీఏ డిజిటలైజ్ టీడీఆర్, లెడ్జర్ వంటి సదుపాయాలతో ప్రత్యేక వెబ్‌సైట్ ద్వారా ప్లాట్‌ఫారంను రూపొందించారు. హెచ్ఎండీఏ టీడీఆర్ ద్వారా భూసేకరణలో ఆస్తులను కోల్పోయిన బాధితులకు పారదర్శకంగా పరిహారాన్ని పొందేలా, క్రయవిక్రయాలకు వీలుగా టీడీఆర్ ఆన్‌లైన్ పోర్టల్ తయారు చేసినట్లు అధికారులు పేర్కొన్నారు. కోల్పోయిన స్థలానికి మార్కెట్ ధరకు అనుగుణంగా రెండు నుంచి నాలుగు రెట్ల వరకు టీడీఆర్‌లూ పొందే వీలు ఉంటుందని, భూ నిర్వాసితులు క్రయవిక్రయాలు జరుపుకొనేందుకు వీలుగా ఉంటుందన్నారు. ఇక హెచ్ఎండీఏ జారీ చేసే టీడీఆర్ సర్టిఫికెట్లన్నింటినీ వెబ్‌సైట్‌లో పొందుపరచనున్నారు.



శనివారం బంజారాహిల్స్ కేబీఆర్ పార్కు వద్ద ట్రాఫిక్ జామ్ అవ్వడంతో నెమ్మదిగా వెళ్తున్న వాహనాలు

## పానీపూరిలో కలర్ మసాలా

### హానికరమైన రంగులతో వడ్డిస్తున్న బేగంబజార్‌లోని చాట్ బండార్

### తనిఖీల్లో గుర్తించిన ఫుడ్ సేఫ్టీ అధికారులు

సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ): చిన్న, పెద్ద తేడా లేకుండా అందరినీ ఆకట్టుకునే పానీపూరి ఇప్పుడు విషపూరితంగా మారింది. వ్యాపారమే లక్ష్యంగా, ప్రజారోగ్యాన్ని గాలికొదిలేసి హానికరమైన మసాల దినుసులు, ఫుడ్ కలర్‌ను కలిపి వినియోగదారులకు అందిస్తున్నారు. తాజాగా ఫుడ్ సేఫ్టీ అధికారులు బేగంపేట్‌లో నిర్వహించిన తనిఖీల్లో ఓ చాట్‌బండార్‌లో నిషేధిత, హానికరమైన మసాలా, రంగులను గుర్తించారు. వీటిని పానీపూరిలో కలిపి జనాలకు వడ్డిస్తున్నారు. బేగంబజార్‌లోని శ్యామ్ సింగ్ చాట్ బండార్‌లో.. ఫుడ్ సేఫ్టీ అధికారుల టాస్క్ ఫోర్స్ తనిఖీల్లో వెల్లడైంది. ఎఫ్ఎస్ఎస్ఏఐ నిబంధనలకు విరుద్ధంగా ఉండటంతోపాటు, పరిమితికి మించి విక్రయాలు జరుగుతున్నాయని, మసాలా చాట్, పానీపూరికి వినియోగించే పదార్థాలన్నీ కూడా గడువు తీరినవేనని తేల్చారు. ఇక ఫ్రిజ్‌లో నిల్వ చేసిన పెరుగు, నూడిల్స్ కలుషితమైనట్లుగా వెల్లడించారు. ఇక చాట్ బండార్‌లో స్వేచ్ఛగా తిరుగుతున్న ఎలుకలు... వినియోగదారులకు అదనపు ఆకర్షణగా నిలుస్తున్నాయని, కలుషితమైన పరిసరాలతో ఉండే చాట్ బండార్ రుచికరమైన పానీపూరీలు దేవుడెరుగు కానీ, అనారోగ్య సమస్యలను అదనంగా వడ్డిస్తున్నట్లు ఉన్నాయి. ఇకనైనా సిటీ జనాలు బజారులో దొరికే ఛాట్ బండార్, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లకు వెళ్లి ఆకలి తీర్చుకోవడం కంటే ఇంట్లోనే రుచి, శుచిగా ఉండే ఆహారాలను తయారు చేసుకోవడం ఉత్తమని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.





## అరుంధతిలో అంతా ఉచితం

### అమ్మానాన్నల లక్ష్యం నెరవేర్చి.. జనం గుండెల్లో నిలిచి..!

### సామాజిక సేవలో ఆదర్శంగా నిలిచిన మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి


IV లో

సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ) : అమ్మానాన్నల లక్ష్యం నెరవేర్చడం ఏ కొడుకుకైనా సంతోషాన్నిస్తుంది. అందులోనూ ఆ లక్ష్యం సామాజిక సేవే అయితే అది ప్రజలందరి సంబురంగా మారుతుంది. తల్లిదండ్రులకు గొప్ప సంతృప్తినిచ్చే విధంగా సేవలందిస్తున్న ఆ కుమారుడి పేరే మర్రి రాజశేఖర్ రెడ్డి. ఎంఎల్ఆర్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఫౌండర్ సెక్రటరీ. అమ్మ పేరు మీద ఆసుపత్రి పెట్టాలని మర్రి రాజశేఖర్ రెడ్డి భావించారు. ఈ విషయాన్ని తన తల్లి అరుంధతికి చెప్పగా ఆమె చాలా సంతోషించింది. అయితే ఆమె తన కొడుకుతో ఇలా అంది 'ఆసుపత్రి నిర్మించడం మంచి ఆలోచన.. అయితే అందులో అందించే ఏ సేవనైనా ఉచితంగా ఉంటేనే నా పేరు పెట్టు. అందరిలా ఆసుపత్రి ఏర్పాటు చేద్దామనుకుంటే మాత్రం నా పేరు పెట్టొద్దు.' అని చెప్పింది. దీంతో రాజశేఖర్ రెడ్డి మరో మాట మాట్లాడకుండా ఉచితంగా సేవలందించేందుకే ఆసుపత్రి నిర్మిస్తానమ్మ అంటూ మాటిచ్చారు. అదే స్ఫూర్తితో 2019లో అరుంధతి ఆసుపత్రిని అందుబాటులోకి తీసుకొచ్చారు. అరుంధతి పేరు చెప్పగానే అందరి నోళ్లల్లో నానేది 'బిల్లు లేని ఆసుపత్రి'. ఈ ఆసుపత్రిలో ప్రతి రోజూ 12 వందల మంది ఔట్ పేషెంట్లను పరీక్షిస్తున్నారు. అంతేకాక తండ్రి మర్రి లక్ష్మణ్ రెడ్డి 2007లో స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను స్థాపించి.. ప్రతి ఏటా 35 మంది విద్యార్థులకు ఉచితంగా విద్యను అందిస్తున్నారు. సమాజంలో విద్య, వైద్యం అత్యంత ఖరీదుగా మారిన ఈ రోజుల్లో.. మేము ఉన్నామంటూ భరోసానిస్తున్న మర్రి కుటుంబ సభ్యుల సేవలు ఆదర్శంగా నిలుస్తున్నాయి. నగర శివారులోని దుండిగల్‌లో ఉన్న మర్రి లక్ష్మణ్ రెడ్డి గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్ దేశ వ్యాప్తంగా ఎందరి మనసుల్లోనే స్థానం దక్కించుకుంది. విద్య, వైద్యాన్ని వ్యాపారం కోణంలో చూసే ఈ రోజుల్లో.. నిరుపేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సాగుతున్న మర్రి కుటుంబంపై **నమస్తే తెలంగాణ ప్రత్యేక కథనం.**

## 'స్టాన్‌ఫోర్డ్'లో అడ్మిషన్ ఇప్పిస్తామంటూ..

## ₹3.25 కోట్లు టోకరా

### భార్యాభర్తలను అరెస్టు చేసిన సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు



సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ): యూఎస్ఏలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్ కోసం అడ్మిషన్ ఇప్పిస్తామంటూ ఓ వ్యక్తి నుంచి రూ. 3.25కోట్లు వసూలు చేసి మోసం చేసిన భార్యాభర్తలను సైబరాబాద్ ఈవోడబ్ల్యూ పోలీసులు అరెస్టు చేశారు. ఈవోడబ్ల్యూ డీసీపీ కె.ప్రసాద్ కథనం ప్రకారం.. మాదాపూర్ ప్రాంతానికి చెందిన చాట్ల సంజీవ్‌కుమార్ తన కుమారుడికి యూఎస్ఏ, కాలిఫోర్నియాలోని స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో అండర్ గ్రాడ్యుయేషన్ అడ్మిషన్ కోసం ప్రయత్నిస్తున్నాడు. ఈ క్రమంలో అదే ప్రాంతానికి చెందిన పాలడుగు రఘురామ్ అతడి భార్య సునీత సంజీవ్‌కుమార్‌కు పరిచయమయ్యారు. తమకు యూఎస్ఏలోని వైట్‌హౌస్‌లో తెలిసిన వారున్నారని వారి ద్వారా కాలిఫోర్నియా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో యూజీసీ కోసం అడ్మిషన్ ఇప్పిస్తామంటూ రఘురామ్ దంపతులు నమ్మించారు. ఇందులో భాగంగా స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ వచ్చినట్లు నకిలీ పత్రాలను సృష్టించారు. ఇందుకోసం సుమంత్ పేరుతో మరో సిమ్‌కార్డు ద్వారా ఒక వాట్సాప్ చాట్ సృష్టించాడు. సుమంత్ అనే వ్యక్తి వైట్‌హౌస్‌లో పనిచేస్తాడని, అతను స్టాన్‌ఫర్డ్ యూనివర్సిటీలో అడ్మిషన్ ఇప్పిస్తాడని, నకిలీ అడ్మిషన్ పత్రాలు చూపించి రూ.3.25కోట్లు వసూలు చేశాడు. బాధితులను నమ్మించేందుకు మైసూర్ వెళ్లిన రఘురామ్ దంపతులు యూఎస్ఏ వెళ్లినట్లు చెప్పడమే కాకుండా అక్కడ సుమంత్‌ను కలిసినట్లు నమ్మబలికారు. బాధితులకు ఏమాత్రం అనుమానం రాకుండా ఉండేందుకు సుమంత్ పేరుతో సంజీవ్‌కుమార్‌కు మెసేజ్‌లు పంపించాడు. రఘురామ్ తనను యూఎస్ఏలో కలిశాడని, అడ్మిషన్‌కు సంబంధించిన ప్రక్రియ జరుగుతుననట్లు ఆ చాట్‌లో పేర్కొన్నాడు. కాని రఘురామ్ పంపించిన అడ్మిషన్ పత్రాలపై అనుమానం రావడంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న ఈవోడబ్ల్యూ పోలీసులు శనివారం రఘురామ్, అతడి భార్య సునీతలను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. రఘురామ్‌పై గతంలో కూడా కూకట్‌పల్లి పీఎస్‌లో చీటింగ్ కేసు నమోదైందని పోలీసులు తెలిపారు. సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి ఆదేశాల మేరకు డీసీపీ కె.ప్రసాద్ పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ సమరం రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.



## వాహనదారుల ఇబ్బందులకు చలించి..

### గుంతల రోడ్డుకు మరమ్మతులు

### జేబీఎస్ చౌరస్తాలో సొంత ఖర్చులతో పూడ్చిన మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు

మారేడ్‌పల్లి, జూలై 27: ఇటీవల కురిసిన వర్షాలకు సికింద్రాబాద్ జేబీఎస్ పరిసర ప్రాంతాల్లో రోడ్లన్నీ గుంతలమయంగా మారాయి. దీంతో ఈ ప్రాంతం గుండా వాహనదారులు, పాదచారులు రాకపోకలు సాగించాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా జేబీఎస్ ఇన్ గేట్, అవుట్ గేట్ వద్ద రోడ్డు పూర్తిగా దెబ్బతినడంతో బస్సులు, ఆటోల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ సమస్యను గుర్తించిన మారేడ్‌పల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భాస్కర్ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. తన సొంత డబ్బులతో రోడ్డు మరమ్మతు పనులు చేపట్టారు. జేబీఎస్ ఇన్, అవుట్ గేట్ వద్ద గుంతలమయంగా మారిన రోడ్డుపై మట్టితో.. ట్రాఫిక్ పోలీసులు, సిబ్బంది మరమ్మతులు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వాహనదారులు, పాదచారులు మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీసు సిబ్బందిని అభినందించారు. తమ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వాహనదారులు సురక్షితంగా ప్రయాణించడమే లక్ష్యమని, తమ వంతు సేవ చేసినట్లు ఇన్‌స్పెక్టర్ భాస్కర్ వెల్లడించారు.

## చెత్త రహిత నగరంగా తీర్చిదిద్దాలి

సిటీబ్యూరో, జూలై 27 (నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలోని అన్ని సర్కిళ్లలో జీవీపీ(గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ల)నుఎత్తివేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు. కుత్బుల్లాపూర్ సర్కిళ్లలో సమస్యాత్మక ప్రాంతాలను గుర్తించి, తొలగించడంపై ఆ సర్కిల్ అధికారులను ఆమె అభినందించారు. నగరంలోని అన్ని సర్కిళ్లలోనూ ఇదే తీరుగా పనిచేస్తూ జీవీపీలను తొలగించేలా కృషి చేయాలన్నారు. జీవీపీ ఫ్రీ నగరంగా తీర్చిదిద్దేందుకు అన్ని సర్కిళ్ల అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. స్వచ్ఛ ఆటోల పనితీరు, క్యూఆర్ కోడ్‌తో స్వచ్ఛ ఆటోలు వందశాతం ఇంటింటి చెత్త సేకరణ చేయాలని సూచించారు. స్వచ్ఛ ఆటోలకు చెత్తవేయని కుటుంబాలను గుర్తించి వారికి అవగాహన కల్పించేలా స్వయం సహాయక సంఘాలు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్, స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఇంటింటి చెత్త సేకరణ జరిగేలా చూడాలన్నారు. బహిరంగ ప్రాంతాల్లో చెత్త వేయకుండా అవగాహన కల్పించాలని చెప్పారు. అధికారులు, కార్మికులు సమన్వయంతో పనిచేసి కుత్బుల్లాపూర్ సర్కిల్‌ను జీవీపీ రహితంగా మార్చడంలో ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ సందర్భంగా సర్కిల్‌లో చేపట్టిన ప్రణాళికలను మోహన్ రెడ్డి, భార్గవ్ వివరించారు.





## బోనాలకు సర్వం సిద్ధం

### ఇబ్బందుల్లేకుండా భక్తులకు అన్ని సదుపాయాలు

### వెల్లడించిన జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 27(నమస్తే తెలంగాణ): గ్రేటర్ పరిధిలో బోనాలకు సర్వం సిద్ధం చేశామని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. శనివారం జోనల్, డిప్యూటీ కమిషనర్లతో నిర్వహించిన టెలి కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతూ.. నగరంలోని ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న బోనాల ఉత్సవాలను ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడించారు. బోనాల సందర్భంగా ఆలయాలకు వచ్చే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. తాగునీరు, పాట్ హోల్స్, పారిశుధ్యం, అవసరమైన చోట టాయిలెట్స్, లైటింగ్ ఏర్పాట్లు చేయాలని, స్ట్రీట్ వెండర్లు వ్యర్థాలను బయటపడేయకుండా చెత్త కుండీల్లో వేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. ఆలయాల చుట్టూ ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని, ఎప్పటికప్పుడూ చెత్తను తీసేలా శానిటేషన్ కార్మికులు ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలను సర్కిళ్ల వారీగా పంపించాలని, కావాల్సిన మరమ్మతులు, ఎవరి ఆధీనంలో ఉన్నాయనే వివరాలపై నివేదిక ఇవ్వాలని కమిషనర్ ఆమ్రపాలి అధికారులను ఆదేశించారు.

### నేడు మద్యం దుకాణాలు బంద్

బోనాల పండుగను పురస్కరించుకుని సైబరాబాద్, రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు, కల్లు కంపౌండ్‌లను మూసివేస్తున్నట్లు పోలీసు కమిషనర్‌లు అవినాశ్ మహంతి, సుధీర్‌బాబు వెల్లడించారు. ఆదివారం ఉదయం 6గంటల నుంచి సోమవారం ఉదయం 6గంటల వరకు మద్యం, కల్లు దుకాణాలు మూసి ఉంటాయని తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధిత సమయంలో విక్రయాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు.



ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న రాచకొండ సీపీ సుధీర్ బాబు

## ఫిర్యాదులపై వేగంగా స్పందించాలి

### సమీక్షా సమావేశంలో రాచకొండ సీపీ సుధీర్ బాబు

జూబ్లీహిల్స్, జూలై 27 : బాధితులకు సత్వర న్యాయం అందించేందుకు డయల్ 100, 112 కు వచ్చే ఫిర్యాదులపై వేగంగా స్పందించాలని రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్ బాబు అధికారులను ఆదేశించారు. శనివారం రాచకొండ కమిషనరేట్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణ చర్యల్లో భాగంగా బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్ బృందాల పనితీరుపై ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో మల్కాజిగిరి డీసీపీ పద్మజ, ఎల్బీ నగర్ డీసీపీ ప్రవీణ్‌కుమార్, యాదాద్రి డీసీపీ రాజేశ్ చంద్ర, ఎస్బీ డీసీపీ కరుణాకర్, డీసీపీ క్రైం అరవింద్ బాబు, మహేశ్వరం డీసీపీ సునీతారెడ్డి, ఐటీ సెల్ ఏసీపీ నరేందర్ గౌడ్, సీసీఆర్బీ ఏసీపీ రమేశ్, ఎస్బీ ఏసీపీ శ్రీధర్ రెడ్డి పాల్గొన్నారు.

## సీపీఆర్‌తో మనిషికి పునర్జన్మ

### ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్‌లో సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం

### ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు

మేడ్చల్/మేడ్చల్ రూరల్, జూలై 27: సీపీఆర్ ద్వారా మనిషికి పునర్జన్మ అందించే ఓ ప్రక్రియ అని హెల్త్ అండ్ ఫ్యామిలీ కమిషనర్, రాష్ట్ర ఆరోగ్య శాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ శ్రీనివాసులు అన్నారు. మాజీ రాష్ట్రపతి, దివంగత ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ ప్రధాన కార్యాలయంలో సీపీఆర్ అవేర్‌నెస్ డే నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా 500 మందికి సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గుండెపోటు వచ్చిన సమయంలో సీపీఆర్ చేసి మనిషి ప్రాణాలను కాపాడవచ్చిని తెలిపారు. ప్రాథమికంగా చేసే ఈ ప్రక్రియ వల్ల మనిషిని దవాఖానకు తీసుకెళ్లే లోపు ప్రాణాలను రక్షించవచ్చన్నారు. మనిషికి పునర్జన్మ అందించే సీపీఆర్‌పై సరైన అవగాహన కల్పించుకున్నప్పుడే అత్యవసర సమయంలో చేయడానికి వీలవుతుందన్నారు. ప్రజలు కూడా సీపీఆర్‌పై అవగాహన పెంచుకోవాలని కోరారు. అలాగే శామీర్‌పేట మండలం దేవరయాంజాల్ పరిధిలోని ఈఎంఆర్ఐ ప్రధాన కార్యాలయంలో కూడా సీపీఆర్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్ఎం డాక్టర్ పృథ్వీ, ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ డైరెక్టర్ వెంకటేశం, ఈఎంఎల్‌సీ డైరెక్టర్ డాక్టర్ రమణా రావు, 108 రాష్ట్ర కార్య నిర్వహణ అధికారి ఎంఏ ఖలీద్, ఈఎంఆర్ఐ మేడ్చల్, హైదరాబాద్ జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ షఫ్తక్ జాన్ షాహిద్, వైద్యులు జావిద్, రవీన్, సిబ్బంది పాల్గొన్నారు.

